క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మ దేవర


పూజలందుకున్న పెద్దమ్మ

తుగ్గలి : మండల పరిధిలోని లంకాయపల్లిలో వెలసిన గ్రామదేవత పెద్దమ్మ అవ్వ దేవర ఉత్సవాలను బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయంలో అమ్మవారికి పసుపుకుంకుమతో విశేష పూజలు చేశారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవాలకు బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి


సబ్సిడీ విత్తనాలను రైతులకు అందిస్తున్న ఏడీఏ, ఏఓ, ఆర్బీకే సిబ్బంది

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన వెల్దుర్తి మండల కేంద్రంలోని ఆర్బీకేలలో విత్తన నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇదివరకే నమోదు చేసుకున్న పలువురు రైతులకు సబ్సిడీ విత్తనాలను క్వింటా రూ.5,700 చొప్పున ఏఓ అక్బర్‌బాషాతో కలిసి పంపిణీ చేశారు. ఆర్బీకే సిబ్బంది ప్రణీత, బందేనవాజ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్‌ను ఎస్‌ఐ ఆధ్వర్యంలో యజమానికి అప్పగిస్తున్న రాజు

కృష్ణగిరి: తనకు దొరికిన ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు మండల వెటర్నరీ అంబులెన్స్ డ్రైవర్ రాజు. విధి నిర్వహణలో భాగంగా రాజు బుధవారం రామకృష్ణాపురం నుంచి కృష్ణగిరి మండల కేంద్రానికి వస్తుండగా రహదారిపై సెల్‌ఫోన్ గుర్తించాడు. ఫోన్ తీసుకుని వచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి విచారించి ఆ మొబైల్ పెనుమాడకు చెందిన కురువ రామాంజనేయులుదిగా గుర్తించి అతనని పిలిపించి రాజు చేతుల మీదుగానే అప్పగించాడు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ యజమాని, ఎస్‌ఐలు రాజును అభినందించారు.

విత్తన నమోదు ప్రక్రియ ప్రారంభం


నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ రవి

మద్దికెర: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవి అన్నారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో విత్తన నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్వింటా ధర రూ.9,500 కాగా 40 శాతం సబ్సిడీ రూ.3,800 పోగా రైతు రూ. 5700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


దుకాణంలో రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

వెల్దుర్తి(కృష్ణగిరి): అనుమతి లేని విత్తనాలు అమ్మితే దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన వెల్దుర్తి మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఏఓ అక్బర్‌బాషాతో కలిసి తనిఖీ చేశారు. రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, స్టాకును తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో అమ్మకానికి ఉంచిన పత్తి, కంది, ఆముదం, పలు కూరగాయల విత్తనాలను పరిశీలించారు. ఎమ్మార్పీకి మించి అమ్మకాలు చేయరాదని, తప్పనిసరిగా లాట్ నెంబరు తదితర పూర్తి సమాచారం, బిల్లులో పొందుపర్చాలని సూచించారు.

‘పది’ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు
- హాజరుకానున్న 3,189 మంది విద్యార్థులు
- 11 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


పది పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు (ఫైల్)

ఆలూరు రూరల్: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఆలూరు నియోజకవర్గ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం నుంచి జూన్ 3వ తేది వరకు పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ఆలూరు, ఆస్పరి, హొళగుంద, దేవనకొండ మండలాల్లో 11 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు అధికారులు. అయితే చిప్పగిరి, హాలహర్వి మండలాల నుంచి పది సప్లమెంటరీ పరీక్షలురాసే విద్యార్థులు ఈ సారి ఆలూరులోని 5 సెంటర్లలో రాయనున్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్ష జరగనుంది. గతంలో మాదిరిగా కాకుండా సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కూడా రెగ్యూలర్ పాస్‌గా గుర్తింపు ఉంటుంది.

పరీక్షలకు 3,189 మంది దరఖాస్తు

నియోజకవర్గంలో ఈ ఏడాది మార్చి 18 నుంచి జరిగిన పది పరీక్షల్లో ఫెయిలైన వారితో పాటు గతంలో ఫెయిలైన విద్యార్థులతో కలిపి మొత్తం 3,189 మంది వివిధ సబ్జెక్టుల పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లను ఆయా పాఠశాలలకు పంపించారు. ప్రధానోపాధ్యాయులు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అందజేశారు. గతేడాది మాదిగానే ఈ సంవత్సరం కూడా ఫెయిలైన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేశారు.

ఏర్పాట్లు పూర్తి

పది పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుతో పాటు ఇన్విజిలేటర్లను నియమించారు. ఆయా పాఠశాల హెచ్‌ఎంలు పరీక్ష చీఫ్‌లుగా నియమించారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డెస్కులు, ఫ్యాన్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. ప్రతి కేంద్రం వద్ద అత్యవసర చికిత్స కోసం వైద్యారోగ్య సిబ్బందిని నియమించారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వారీగా..

పరీక్ష కేంద్రం పేరు	విద్యార్థుల సంఖ్య
ప్రభుత్వ బాలుర-1, పాఠశాల, ఆలూరు	240
ప్రభుత్వ బాలుర-2, పాఠశాల,ఆలూరు	238
సెయింట్ జాన్స్ ఈఎం,స్కూల్,ఆలూరు	250
జిల్లా పరిషత్ బాలికల పాఠశాల,ఆలూరు	196
ఏపీ మోడల్ స్కూల్,ఆలూరు	862
జిల్లా పరిషత్ హై స్కూల్,హొళగుంద, సెంటర్-ఏ	235
జిల్లా పరిషత్ హైస్కూల్,హొళగుంద, సెంటర్-బీ	235
జిల్లా పరిషత్ హైస్కూల్, ఆస్పరి	350
విజేత ఈఎం ప్రైవేట్ స్కూల్,ఆస్పరి	170
జిల్లా పరిషత్ హైస్కూల్, దేవనకొండ	213
కేజీబీవీ పాఠశాల, దేవనకొండ	200

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం



పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలను రెగ్యూలర్ పరీక్షల మాదిరి పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అర గంట ముందు చేరుకోవాలి. ఫర్నీచర్, తాగు నీరు, ఫ్యాన్లు, తదితర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.
– చిరంజీవి రెడ్డి, ఎంఈఓ–2, ఆలూరు

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- నియోజకవర్గంలో 5 సెంటర్లు.. 3,034 మంది విద్యార్థులు

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఇంటర్ బోర్డు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఆలూరు నియోజకవర్గంలోని ఆలూరు, ఆస్పరి, హొళగుంద, దేవనకొండ, చిప్పగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొదటి సంవత్సరం 2,239 మంది, ద్వితీయ సంవత్సరం 795 మంది మొత్తం 3,034 మంది విద్యార్థులు పరీక్షలకు రాయనున్నారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు సిబ్బందిని నియమించారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చి, వీటి ద్వారా ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా స్ట్రీమింగ్ చేస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం (రెండు సెషన్లుగా) నిర్వహించనున్నారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఘనంగా అమ్మవార్ల కుంభోత్సవం


చింతకుంటలో అమ్మవార్లను దర్శించుకునేందుకు వెళ్తున్న విరూపాక్షి

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో మదగమ్మదేవి, కించమ్మదేవి, సుంకలమ్మదేవి అమ్మవార్ల కుంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరూపాక్షి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామిరెడ్డి, ఎంపీపీ నెట్టికంటమ్మ, రాష్ట్ర కార్యదర్శి జనార్ధన్‌నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ రంజిత్, మండల కో–కన్వీనర్ మల్లికార్జున, చింతకుంట సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ బసప్ప, నాయకులు మారయ్య, పరశురామ్, గంగాధర, సర్పంచ్ సద్దాంహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

చిప్పగిరి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారని సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆలూరు నియజకర్గం నుంచి బరిలోదిగిన బుసినె విరుపాక్షి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని సంగాల గ్రామంలో సుంకులమ్మ అవ్వ దేవర గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు చలువ బిందెలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని విరుపాక్షి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతికుటుంబానికి అందాయన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఓటర్లు పోటెత్తారని, జగనన్నను మళ్లీ చేస్తున్నారన్నారు. కూటమి ముసుగులో టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మలేదన్నారు. జూన్ 4న వచ్చే ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించబోతోందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రేమ్ కుమార్, కోకన్వీనర్ సత్తిరెడ్డి, ఎంపీటీసీలు సుంకన్న, భీమలింగ, గురుదాస్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


ఆలూరు సీఐ బి. వెంకటేశ్వర్లు

ఆలూరు: అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులు,కార్యకర్తలకు ఉన్నాధికారులు ఆదేశాల మేరకు సలహాలు, సూచనలు చేశామన్నారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ ఉంటుందని, ఈ మేరకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. అల్లర్లకు పాల్పడకుండా, కర్ణాటక మద్యం రవాణ దారులపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచామని చెప్పారు. ర్యాలీలు, సంబరాలకు ఏ మాత్రం అనుమతులు లేవని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించి సహకరించాలని సూచించారు.

ఉపాధి కూలీల ఆందోళన


గజ్జహళ్లిలో ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

హొళగుంద: ఉపాధి పనికి రాని వారికి మస్టర్లో హాజరు వేసి పని చేసే వారికి కోతలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం గజ్జహళ్లి గ్రామంలో ఉపాధి కూలీలు ఆందోళనకు దిగారు. కష్ట పడి పని చేస్తున్న కూలీలకు పని దినాలు తగ్గిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఇదేమిటని ప్రశ్నిస్తే సాకులు చెబుతున్నాడని కూలీలు ఖాసీం, పాండు, బాషా, మల్లమ్మ తదితరులు ఆరోపించారు. పనులు కూడా ఎండలో చాలా దూరంగా పెడుతున్నారని, తాగునీరు ఇతర వసతులు కల్పించడం లేదని వాపోయారు. ఈ విషయం పై ఏపీఓ భక్తవత్సలంను వివరణ కోరగా .. కొందరు రోజు తక్కువ గంటలు పని చేసినా 8 గంటలకు సరి చేసి వారికి రూ.300 కూలీ గిట్టుబాటు అయ్యేలా చేయడం వల్ల దినాలు తగ్గుతాయన్నారు. కోతలు పడిన దినాలకు మళ్లీ పని కల్పిస్తామని.. ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

ఎల్లమ్మ తిరునాల ప్రారంభం


ప్రత్యేక శోభ సంతరించుకున్న ఎల్లమ్మ గుడి


అమ్మవారు

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ తిరునాల బుధవారం ప్రారంభమయ్యింది. అమ్మవారు ప్రత్యేకాలంకరణలో దర్శనమివ్వగా, ఈడిగ కులస్తుల ప్రతినిధిగా భాస్కర్ గౌడ్ అమ్మవారికి కల్లు నైవేద్యంగా సమర్పించి అర్చకుల ఆధ్వర్యంలో శాంతి జరిపారు. ఉత్సవాల సందర్భంగా ఎల్లమ్మ గుడి ప్రత్యేక శోభను సంతరించుకుంది. అంగళ్లు వెలిశాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చన, పూర్ణాహుతి, కుంకుమోత్సవం తదితర సేవలు, బోణాల సమర్పణ, ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహించనున్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్ నాయుడు

ఆలూరు రూరల్: గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచి, వాటి అభివృద్ధికి కృషి చేయాలని పత్తికొండ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడు పంచాయతీల కార్యదర్శులకు సూచించారు. ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీలో కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రికార్డులను సక్రమంగా ఉంచాలన్నారు. గ్రామ సభ తీర్మానాలు, ఇంటి, కుళాయి పన్ను వసూళ్లు, ఇంటి అనుమతుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మురుగు కాల్వలు శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలన్నారు. సమావేశంలో మేజర్ గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు రాంబాబు, వినోద్, పంచాయతీ కార్యదర్శులు విజయ్, ఉరుకుందప్ప, నాయుడు, జిలాన్, రామాంజినమ్మ, భాగ్యమ్మ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫారెస్ట్ ఉద్యోగికి గాయాలు


చికిత్స పొందుతున్న ప్రభాకర్

ఆలూరు రూరల్: కర్ణాటక బస్సు ఢీకొని ఫారెస్ట్ ఉద్యోగికి గాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ఆలూరు సమీపంలోని హైవే 167లో ఆంజనేయ స్వామి విగ్రహం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. హొళగుంద మండలం నెరణికి ఈస్ట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ ఆఫీసు పని నిమిత్తం స్కూటర్‌పై కర్నూలు వెళ్తున్నాడు. ఆదోని వైపు నుంచి బళ్లారికి వెళ్తున్న కర్ణాటక బస్సు(కేఏ 34 ఎఫ్ 1415) స్కూటర్‌ను ఢీకొట్టింది. ప్రభాకర్ ముఖానికి, చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. దేవరగట్టు బీట్ ఆఫీసర్ కృష్ణ క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఆస్పత్రికి రెఫర్ చేయగా, అక్కడి నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు మంజూరు

హొళగుంద: 2024–25 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు మంజూరైనట్లు వ్యవసాయాధికారి ఆనంద్‌లోకదళ్ బుధవారం తెలిపారు. మండలానికి 402 క్వింటాళ్ల విత్తనాల కోసం ప్రతిపాదనాలు పంపగా 105 క్వింటాళ్లు మంజూరు చేశారన్నారు. క్వింటాం మార్కెట్‌లో రూ.9,500 ఉండగా 40 శాతం సబ్సిడీ పోను రూ.5,700 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగ జీలుగా(దయాంచ) 25 కింటాళ్లు, పిల్లి పెసర 4 క్వింటాళ్లు మంజూరైయ్యాయని, 50 శాతం సబ్సిడీ పోనూ పిల్లి పెసర క్వింటాం రూ. 6,700, జీలుగా రూ.4,400 ప్రకారం అందజేస్తామన్నారు.

వివాహిత ఆత్మహత్య

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామానికి చెందిన వివాహిత కురువ ఉమమహేశ్వరమ్మ (28) బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బెంగళూరుకు వలస వెళ్లి అక్కడ పని చేసుకుంటుండగా ఓటు వేసెందుకు ఉమమహేశ్వరమ్మ భర్తతో కలిసి గ్రామానికి వచ్చింది. భర్త తిరిగి బెంగళూరుకు వెళ్లగా ఆమె గ్రామంలోని ఉంది. ఆత్మహత్యపై విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు తెలిపారు.

25న జిల్లా స్థాయి రగ్బీ జూనియర్ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 25 వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో అండర్–18 రగ్బీ క్రీడాంశంలో బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 నుంచి 2009 సంవత్సరాల మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన బాల బాలికలు రూ. 10 దరఖాస్తు రుసుం చెల్లించి నేరుగా ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరచి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31 వ తేదీన విశాఖపట్నం జిల్లా తిమ్మాపురం (బీమిలీ)లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి రాగిణి సూచించారు. బుధవారం స్థానిక వైద్యశాలలో సిబ్బందితో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురుగనీరు నిల్వ ఉండడం వల్ల సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర రోగాలు ప్రబలే ప్రమాదముందన్నారు. ఎక్కువ కాలం నీరు నిల్వ ఉంచకుండా అవగాహన కల్పించాలన్నారు.

వేరుశనగ విత్తనాలకు 1,634 మంది రిజిస్ట్రేషన్

తుగ్గలి : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసేందుకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై రైతులకు వేరుశనగ విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు వ్యవసాయశాఖ మండల అధికారి పవన్‌కుమార్ తెలిపారు. మూడు రోజులుగా ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా బుధవారం నాటికి 1,634 మంది రైతులు 1420 క్వింటాళ్ల వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఏఓ చెప్పారు. రెండు మూడు రోజుల్లో వేరుశనగ విత్తన పంపిణీని ప్రారంభిస్తామన్నారు. వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో ఆర్‌బీకేల్లో సంప్రదించాలన్నారు.

క్షయను నిర్లక్ష్యం చేయొద్దు


క్షయపై రోగులకు అవగాహన కల్పిస్తున్న గోపాల్

ఆస్పరి: క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించుకోవాలని టీడీ హెల్త్ సూపర్ వైజర్ గోపాల్ రోగులకు సూచించారు. బుధవారం మండలంలోని జొహరాపురం హెల్త్ సెంటర్‌లో క్షయ వ్యాధిపై రోగులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. ఎవ్వరికైనా 15రోజులు జ్వరం, దగ్గు, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కన్పిస్తే స్థానిక ఆరోగ్య కేంద్రంలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జీవిత, పురుషోత్తం, సాయికుమార్, శకుంతల, పుష్ప, లత, అరుణాకుమారి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతం


నగరూరు గ్రామ సమీపంలోని పొలంలో గుంటక పొస్తున్న ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్

ఆస్పరి/దేవనకొండ: ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతమవడమే కాకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ యస్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆస్పరి మండలంలోని నగరూరు, గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన సోమిరెడ్డి పొలంలో గుంటక పొశారు. అపై పొలంలో పెసలు, మినుములు, అలుసందలు, ఉలువలు, అనుములు, జీలుగ, నువ్వులు, ఆవాలు, కొర్రలు, మొక్క జొన్నలు, జొన్నలు, సెన గలు, రాగులు, సజ్జలు, కందులు, అముదాలు, పొద్దుతిరుగుడు, గోంగూర, సోర, బీర, జనుము, బీన్స్ తదితర విత్తనాలను చల్లారు. అలాగే దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల గ్రామ రైతు మల్లికార్జున పొలంలో వేస్తున్న డాట్ ప్రూఫ్ మోడల్స్‌ను పరిశీలించారు. మేనేజర్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎక్కువ రకాల పంటలు వేసుకోవడం వల్ల రైతులకు ఆదాయంతో పాటు నేలలో జీవ పదార్థం, భూసారం పెరుగుతుందన్నారు. అలాగే కషాయాలు, ద్రావణాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజేశ్వర్, మల్లికార్జున, నగేష్, వీరేష్, నాగార్జున, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కలుగొట్లలో కార్డెన్ సర్చ్


ఓ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో బుధవారం తెల్లవారుజామున సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో గ్రామంలోని పోలింగ్ బూత్ వద్ద స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసులు రాజకీయ వర్గాలు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం సీఐ గ్రామస్తులతో సమావేశమయ్యారు. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరు అల్లర్లు, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అరెస్టులు, కేసుల వరకు తెచ్చుకోవద్దని సూచించారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి, ఏఎస్‌ఐ, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

వేదావతికి జలకళ

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి గ్రామం వద్ద ఉన్న వేదావతి (హగరి) నది నీటితో కళకళలాడుతోంది. నది ఎగువ భాగంలోని గుంతకల్, రాయదుర్గం, కణేకల్ తదతర ప్రాంతాల్లో వర్షాలు కురువడంతో నదిలోకి వరద నీరు చేరాయి. బుధవారం మార్లమడికి వద్ద ఉన్న కాజ్‌వేను దాటి ముందుకెళ్లాయి. నదిలో ఇంకా నీటి ప్రవాహం పెరిగితే పశువులు, ఇతర అవసరాలకు అనువుగా ఉంటుందని పరివాహక గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా జూన్‌లో నదికి నీటి ప్రవాహం మొదలవుతుండగా ఈ సారి మే నెలలో అకాల వర్షాలకే నదిలో ప్రవాహం మొదలవడంతో హొన్నూరు, నాగరకణ్వీ, మార్లమడికి, కోగిలతోట ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మార్లమడికి వద్ద వేదావతి నదిలో ప్రవహిస్తున్న వరదనీరు